# కష్టకాలంలో కుటుంబాలకు అండగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

## అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలకు భరోసా



తెలుగు గళం న్యూస్ ఐనవోలు, ఆగస్టు 8

కష్టకాలంలో పార్టీ కార్యకర్తలు, ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు.శుక్రవారం ఐనవోలు మండల కేంద్రం, పున్నెలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను ఆయన పరామర్శించారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లారు. అవునూరి ఒదమ్మ, కొండేటి కోవూరుమల్లమ్మ, పున్నెలు గ్రామానికి చెందిన గుడికందుల లక్ష్మీకాంత, గండి సదానందం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.కష్టకాలంలో కుటుంబాలకు అండగా ఉంటానని, ఎలాంటి అవసరం ఉన్నా తనను సంప్రదించాలని ఎమ్మెల్యే భరోసా కల్పించారు.అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలకు పరామర్శ

అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్‌రావు, జేబీఎం జిల్లా అధ్యక్షుడు జన్నపురెడ్డి రుగ్వేద్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పొలపెల్లి బుచ్చిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎలిశా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నకరకంటి మోహన్‌గౌడ్, ఐనవోలు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, దేవస్థాన చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, ఉప సర్పంచ్ భాస్కర్, సీనియర్ నాయకులు మధుగౌడ్, తిరుపతిరెడ్డి, రవి, రాకేష్‌రెడ్డి, సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి ఆలయంలో గ్రానైట్ పనులు

## పరిశీలించిన బీఆర్ఎస్ నేత పసునూరి నవీన్ కుమార్



తెలుగు గళం న్యూస్ పాలకుర్తి, ఆగస్టు 8

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో త్వరలో జరగనున్న బోనాల పండుగను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దేవాలయంలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ కుమార్ తన స్వంత ఖర్చులతో గ్రానైట్ పనులను చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న గ్రానైట్ పనులను ఉప సర్పంచ్ గాదెపాక కిరణ్, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులతో కలిసి పసునూరి నవీన్ కుమార్ పరిశీలించారు.పనుల నాణ్యత, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై వారు చర్చించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# పామిడిలో భగవద్గీత కర్మయోగంపై గీతా జ్ఞాన యజ్ఞం

తెలుగు గళం న్యూస్
న్యూస్, పామిడి ఆగస్టు 08






భగవద్గీతలోని కర్మయోగ సిద్ధాంతంపై పామిడిలో గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహించారు. చిన్మయ మిషన్ అనంతపురం ఇంచార్జ్ స్వామి ఆత్మావిదానంద సరస్వతి స్వామివారు భగవద్గీత మూడవ అధ్యాయం కర్మయోగంపై భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు.పామిడి పట్టణంలోని శ్రీ అనఘ ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రంలో గీతా జ్ఞాన యజ్ఞం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత మూడవ అధ్యాయం కర్మయోగంలోని ముఖ్యమైన అంశాలను స్వామివారు వివరించారు.మనిషి తన కర్తవ్యాన్ని ఫలాపేక్ష లేకుండా, నిబద్ధతతో నిర్వహించాలి, కర్మను విడిచిపెట్టడం కాకుండా, ధర్మబద్ధమైన కర్మ చేస్తూ ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలని స్వామివారు వివరించారు.కర్మయోగం ద్వారా వ్యక్తి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు సమాజానికి కూడా సేవ చేయవచ్చని పేర్కొన్నారు. భగవద్గీత బోధనలు ప్రతి ఒక్కరి జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని స్వామివారు తెలిపారు.ఈ గీతా జ్ఞాన యజ్ఞ కార్యక్రమానికి పామిడి పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఆసక్తిగా ఆలకించారు. భక్తులతో అనఘ ఆత్రేయ దత్త పాదుకా క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.కర్మయోగం ద్వారా కర్తవ్య నిర్వహణ, సేవాభావం, ఆధ్యాత్మిక చింతనపై స్వామివారు అందించిన సందేశం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

# మల్లమ్మ గుంటలో తల్లిపాల వారోత్సవాలు

నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం):–



నెల్లూరు జిల్లా రాపూరు మండలం మల్లంగుంట గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సీడీపీవో శారద పర్యవేక్షణలో, రాపూరు–1 సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగనవాడి అధికారులు మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు, ముఖ్యంగా ముర్రుపాలు పట్టించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ముర్రుపాలలో శిశువుకు అవసరమైన పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే అంశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం ద్వారా శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు దోహదపడుతుందని సూచించారు.గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తల్లిపాల ప్రాముఖ్యతను తెలుసుకుని, శిశువుకు మొదటి ఆహారంగా తల్లిపాలనే అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి, ప్రమీల, వరలక్ష్మి, ఆసిఫా, మాధవి, సాధీర అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనపూర్ రిజర్వాయర్ ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు-ఎమ్మెల్యే కడియం శ్రీహరి

## ఆగస్టు 14 నుంచి దేవాదుల రిజర్వాయర్ల ద్వారా నీటి విడుదల

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 8



స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ కింద ఉన్న 2,500 ఎకరాల ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించేందుకు అవసరమైన కెనాల్స్‌ను నిర్మిస్తామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. రిజర్వాయర్ కుడి కాలువను శనివారం నీటిపారుదల శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు.

ప్రస్తుతం కుడి కాలువలో పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను వెంటనే చేపట్టి మూడు రోజుల్లో పంటలకు సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. కాలువకు ఇరువైపులా సైడ్‌వాల్స్ నిర్మించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. శాశ్వత కెనాల్స్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను మూడు నెలల్లో సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

ఘనపూర్ రిజర్వాయర్‌ను దేవాదుల ఎత్తిపోతల పథకంలో భాగంగా 1.5 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారని, దీని కింద సుమారు 2,500 ఎకరాల ఆయకట్టు ఉందని కడియం శ్రీహరి తెలిపారు. కెనాల్స్ ఆధునికీకరణ జరగకపోవడంతో పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి కెనాల్స్ నిర్మాణం పూర్తి చేసి రెండు పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాలువల్లోకి మురుగు నీరు రావద్దు

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మురుగునీరు పంట కాలువల్లో కలుస్తుండటంపై ఎమ్మెల్యే తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మురుగు నీరు పంట కాలువల్లోకి రాకుండా డ్రైనేజీ వ్యవస్థను రీడిజైన్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వరదనీరు, మురుగునీరు పంట కాలువల్లో కలవకుండా వాగుల్లోకి వెళ్లే విధంగా డ్రైనేజీలు, వరద కాలువలను నిర్మించాలని సూచించారు.





ఆగస్టు 14 నుంచి సాగునీటి విడుదల

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆరుతడి పంటలు కూడా ఎండిపోయే పరిస్థితి నెలకొందని కడియం శ్రీహరి అన్నారు. రైతులకు సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చిస్తూ అధికారులను సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు.

ధర్మసాగర్, స్టేషన్ ఘనపూర్, అశ్వరావుపల్లి, గండి రామారం, నవాబ్‌పేట రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేస్తూ ఆగస్టు 14 నుంచి నియోజకవర్గంలోని అన్ని దేవాదుల రిజర్వాయర్ల ద్వారా పంటలకు సాగునీరు విడుదల చేస్తామని స్పష్టం చేశారు.

ఆగస్టు 14 నుంచి 15 రోజుల పాటు నీటిని విడుదల చేసి, అనంతరం మరో 15 రోజుల పాటు రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసే విధంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. నీటి లభ్యత దృష్ట్యా నిరంతరాయంగా నీటిని విడుదల చేయడం సాధ్యం కానందున ఆన్––ఆఫ్ పద్ధతిలో సాగునీరు అందిస్తామని, రైతులు సహకరించి కాలువల ద్వారా వచ్చే నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, నీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారాం, ఈఈలు, డీఈలు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


# డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్ రెడ్డితో పాటు ఎనిమిది మందిపై కేసు నమోదు




తెలుగు గళం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 08:

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల విలువైన భూములను అక్రమంగా కట్టబెట్టిన వ్యవహారంలో ప్రస్తుత నెల్లూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్ రెడ్డితో పాటు మరో ఎనిమిది మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వీఆర్వో, సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా నిందితులుగా ఉన్నారు. కడప నగర శివారులోని సుమారు రూ.12 కోట్ల విలువైన భూమిని నకిలీ సర్టిఫికెట్లు, పత్రాల ఆధారంగా వేరొకరి పేరుపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు అధికారులు నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. గతంలో సీకే దిన్నె తహశీల్దార్‌గా పనిచేసిన సమయంలో మహేశ్వర్ రెడ్డి వైసీపీ నాయకులతో చేతులు కలిపి ఈ అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. రికార్డులను పరిశీలించి నకిలీ పత్రాల వ్యవహారాన్ని నిర్ధారించుకున్న అధికారులు, డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న మహేశ్వర్ రెడ్డి సహా మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్టు సమాచారం..

# ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పుట్టా.



తెలుగు గళం న్యూస్ కడపజిల్లా ఆగస్ట్ 08:

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో నిర్వహించిన ఇంటింటికి టీడీపీ డోర్ టు డోర్ క్యాంపెయిన్ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుట్టా, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం మహా న్యూస్ టీవీ ఛానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన జడ్జిమెంట్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ రెండేళ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సేవలు, మైదుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మైదుకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పుట్టా తెలిపారు

